క్లుప్తంగా

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



గ్రంథాలయాల ప్రయోజనాలను వివరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ శ్రీవాసన్

విజయగరం అర్బన్: గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.శ్రీవాసన్ కోరారు. గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి పురస్కరించుకుని, వర్సిటీలో జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం సోమవారం నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత లక్ష్య సాధనలో గ్రంథాలయాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని, అందులో ఉండే అకడమిక్, పోటీ పరీక్షల పుస్తకాలు చదివి ఎంతోమంది అనుకున్న లక్ష్యం చేరుకున్నారని తెలిపారు. క్రమశిక్షణ, విద్యకు మారుపేరుగా నిలిచే గ్రంథాలయాల్లో ప్రతిఒక్కరూ కాసేపు సమయం గడపాలని, వాటితో ఉన్నతమైన వ్యక్తిత్వం, అపారమైన జ్ఞానం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, నారాయణ, జితేంద్రమోహన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

డెంకాడ: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల డబ్బులు రాని రైతులు ఈ నెల 20వ తేదీలోగా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి టి.సంగీత తెలిపారు. ఆయా పథకాల నగదు పడని అన్నదాతలంతా దరఖాస్తు చేసుకున్న అనంతరం 1బి, ఆధార్, ఫోన్ నంబర్ వెంట తీసుకుని దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి ఇవ్వాలన్నారు.

నెల్లిమర్ల: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి, డబ్బులు పడని వారెవరైనా ఉంటే వారు గ్రీవెన్స్‌లో ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని మండల ఏవో శ్రీలక్ష్మి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. రైతులు తమ అర్హత స్థితిని సంబంధిత పోర్టల్, రైతు మిత్ర యాప్‌లో చూసుకోవాలని, ఆధార్, 1బి, బ్యాంక్ అకౌంట్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్‌ను గ్రీవెన్స్‌కు పట్టుకుని వెళ్లి, ఫిర్యాదు చేస్తే డబ్బులు పడతాయన్నారు.

పూసపాటిరేగ: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు పడని వారంతా ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏవో కె.నీలిమ ఓ ప్రకటనలో సోమవారం కోరారు.

పిచ్చిమొక్కలు తొలగించరూ..



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో విపరీతంగా పెరిగి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని అక్కడికి వచ్చే వారంతా కోరుతున్నారు. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, తీగమొక్కల కారణంగా కార్యాలయ ప్రాంగణమంతా అడవిని తలపిస్తోందని, ఏ దిక్కు నుంచి పాములు, విషపురుగులు వచ్చి కాటేస్తాయేమోనని భయంగా ఉందని అంటున్నారు.

సన్మానం

నెల్లిమర్ల: ఎంఈవో సూర్యనారాయణమూర్తిని మండల కేంద్రంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ అధికారిగా ఇటీవల జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయనను అభినందిస్తున్న ఈ సత్కారం చేసినట్లు ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిందాల్ నిర్వాసితులతో కలిసి సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. దెప్పూరు, బందవలస గ్రామాల ప్రజలకు తెలియకుండానే వారి భూములు జిందాల్ పేరుమీద రిజిస్ట్రేషన్ అయిపోయాయన్నారు. వెంటనే ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి రైతులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఇదే సమయంలో ఎస్.కోట పోలీసులు జిందాల్ నిర్వాసితులను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అక్కడే ఉన్న ఎమ్మెల్సీ రఘురాజు స్పందిస్తూ నిర్వాసితులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. జిందాల్ గురించి ఎవ్వరూ మాట్లాడకూడదని ప్రభుత్వం జీఓ ఇచ్చిందా అంటూ మండిపడ్డారు.

వ్యాధుల కాలం.. పశువులు భద్రం!

- వానాకాలంలో మూగజీవాలు జాగ్రత్త
- గాలికుంటు, గొంతు, జబ్బవాపు వ్యాధులు వచ్చే అవకాశం
- ముందస్తు టీకాలతో రోగాలు దూరం
- అలసత్వం వహిస్తే నష్టమని పశువైద్యుల సూచన



భోగాపురంలో షెడ్డు ఆరుబయట ఉన్న పశువులు



భోగాపురం: వర్షాకాలం వచ్చిందంటే చాలు..పాడి రైతు గుండెల్లో గుబులు మొదలవుతుంది. దీనికి ప్రధాన కారణం పశువులకు సోకే వ్యాధులే.. అయితే చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే వాటిని ప్రాణపాయం నుంచి తప్పించవచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు. ఏ వ్యాధి ఏ లక్షణాలను కలిగి ఉంటాయి.. దానిని ఏ విధంగా అరికట్టవచ్చనే అంశాలపై తప్పనిసరిగా పాడిరైతులు అవగాహన కలిగి ఉండడం అవసరమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మూగజీవాలకు సోకే వ్యాధులు–వాటి లక్షణాలు, నివారణ చర్యలపై కథనం..

మొత్తం 56,150 పశువులు..

నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల మండలాల్లో ఆవులు 50,060, గేదెలు 6,090 కలిపి మొత్తం 56,150 పశువులు ఉండడంతో పాటు ఎద్దులు, గొర్రెలు, మేకలు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో వ్యాధుల నుంచి వీటిని రక్షించేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ కాలంలో పశువులకు అధికంగా గొంతు, జబ్బవాపు వ్యాధులతో పాటు చిటుకు, గాలికుంటు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

గాలికుంటు వ్యాధి..

వాతావరణ మార్పులతో కలషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లిపాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షకాలంలో ఆవులు, గేదెలకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి గిట్టలు ఉన్న ప్రతి జీవికి సోకుతుంది. పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోట్లో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని దుస్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేకపోవడంతో నీరశించిపోతాయి.

నివారణ చర్యలు..

వ్యాధి సోకిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. నోటిలో ఉన్న పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లను ముందు ద్రావణంతో శుభ్రం చేసి, దానిపై ఈగలు వాలకుండా వేపనూనె రాయాలి. యాంటి బయాటిక్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది.

టీకాలే రక్ష..

వానాకాలంలో సోకే వ్యాధుల నివారణకు పశువులకు ముందుస్తు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పాలదిగుబడి తగ్గిపోతుందని కొంతమంది రైతులు టీకాలు వేయించడానికి వెనకడుగు వేస్తారు. టీకాలు వేయడం ద్వారా పాలదిగుబడి తగ్గిపోతుందనేది అపోహ మాత్రమేనని పశువైద్యులు అంటున్నారు. వ్యాధి ముదిరి పశువులు చనిపోయి నష్టపోవడం కన్నా ముందుగానే టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా ఉంచవచ్చని ముంజేరు పశువైద్యాధికారి యు.రామరాజు తెలిపారు.

వరిగడ్డి మేలు..



వానాకాలంలో పశువుల మేతకు ఉపయోగించే పచ్చిగడ్డికి మట్టి, బురద తగిలి ఉండడంతో పాటు అదో రకమైన వాసన వస్తుంటుంది. దీంతో దానిని పశువులు తినడానికి అంతగా ఇష్టపడవు. ఈ నేపథ్యంలో పచ్చిగడ్డికి బదులుగా వరిగడ్డిని మేతగా పెట్టాలి. ఇది పశువులకు మేలు చేస్తుంది. వరిగడ్డి తినే పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరిగి వర్షాకాలంలోని చల్లని వాతావరణానికి మధ్య సమతుల్యం ఏర్పరుస్తుంది. అలాగే పశువులను ఉంచే ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి.

– యు.రామరాజు, పశువైద్యాధికారి, ముంజేరు

గొంతువ్యాపు వ్యాధి..

ఈ కాలంలో పశువులకు ప్రధానంగా గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీన్నే గురకవ్యాధి అని కూడా అంటారు. ఆవులు, గేదెలు ముఖ్యంగా దూడల్లో ఇది ఎక్కువగా వ్యాపిస్తుంది. గొర్రెలు, మేకలు, పందులకు కూడా ఇది సోకుతుంది. ఇది ఒక రకమైన అంటువ్యాధి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతుంది. గురక వస్తుంది, శ్వాసపీల్చడం కష్టమవుతుంది. వ్యాధిసోకిన వాటికి 106, 107 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది. గొంతు కిందికి నీరు దిగి గొంతుకు వాపు లాంటిది వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఉంది.

నివారణకు చర్యలు..

ఈ వ్యాధి నివారణకు జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి సోకిన దొడ్డిని ఫినాయిల్, క్రిసాల్ వంటి క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. తప్పనిసరిగా పశువైద్యాధికారిని సంప్రదించాలి.

జబ్బవాపు వ్యాధి..

ఈ వ్యాధి క్రిలాస్టిడియంబావై అనే బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంది. ఇది పశువులు, గొర్రెలు, మేకలకు హాని కలిగించే తీవ్రమైన అంటువ్యాధి. తెల్ల పశువుల్లో ఆరు నెలల నుంచి మూడేళ్ల వయసులోపు పశువులకు ఎక్కువగా సోకుతుంది. ఈ వయసులో పశువులకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. మట్టి, కలుషితమైన మేత, నీటి ద్వారా పశువులకు ఈ వ్యాధి సంభవిస్తుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి కుళ్లిపోయేలా చేస్తుంది. ఈ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ ఒక్కటే సరైన మార్గమని పశువైద్యులు చెబుతున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వరదనీరు నిల్వ ఉండే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ఉధృతి ఎక్కువగా ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఆయన ఏయే ప్రాంతాల్లో వరదనీరు ఉందో.. అక్కడి ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురవుతున్నారో పరిశీలించారు. రోడ్లపై వర్షపునీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఆ చర్యలను యుద్ధప్రాతిపదికన చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ట్యాంక్ బండ్ రోడ్డు వద్ద పెద్దచెరువు అవుట్ ఫ్లో ప్రాంతానికి వెళ్లిన ఆయన..అక్కడి ప్రధాన కాలువలోకి భారీగా వచ్చి చేరిన గుర్రపుడెక్కను జేసీబీతో తొలగించేయించి, నీటి ప్రవాహానికి అడ్డు తొలగించారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూసుకోవాలని కోరారు. వర్షాల వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే నగరపాలక సంస్థ కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్ 98499 06486ను సంప్రదించి, సాయం పొందవచ్చన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



భోగాపురం: వాగును తలపిస్తున్న కవులవాడ రహదారి



భోగాపురం: కాలువలా కనిపిస్తున్న రావాడ నుంచి తూడెం వెళ్లే రోడ్డు



భోగాపురం: ముక్కాం నుంచి చేపలకంచేరు వెళ్లే రోడ్డులో ఇదీ పరిస్థితి..



నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్ వద్ద రైల్వేబ్రిడ్జి కింది రోడ్డులో గుంతలో నిల్వ ఉన్న వరదనీరు

తుపాను ప్రభావంతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. ఏ రోడ్డు చూసినా చెరువు, కాలువను తలపిస్తున్నాయి. ఇప్పటికే ఛిద్రమై ఉన్న రోడ్లు ఈ వానలకు మరింత కోతకు గురై మరీ అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం రహదారుల గుంతల్లోకి చేరిన వరద నీటితో ఎక్కడ ఏ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి. దీంతో రోడ్లు మీదుగా ప్రయాణించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి నాటికి రోడ్లు వేసి చూపిస్తామని ప్రగల్భాలు పలికారని, ఇలాగేనా చేసేదని కూటమి ప్రభుత్వాన్ని జనం నిలదీస్తున్నారు. వర్షాలకు ముందే మరమ్మతులకు గురైన రోడ్లు బాగు చేసి ఉంటే ఇప్పుడు ఈ దుస్థితి పట్టేది కాదని అభిప్రాయపడుతున్నారు. – నెల్లిమర్ల, భోగాపురం

సీతంలో బీఐఎం వర్క్‌షాప్ ప్రారంభం



విద్యార్థినులను అభినందిస్తున్న సీతం కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'బిల్డింగ్ ఇన్‌ఫర్మేషన్ మోడలింగ్(బీఐఎం)' అనే అంశంపై ఐదు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన ఎయిమ్స్ ఆస్ప్రత్రి టెక్నాలజీస్ మేనేజర్ రంజిత్, సీనియర్ టెక్నికల్ ట్రైనర్ ఎం.శేషగిరిరావులు ఈ కార్యక్రమంలో పాల్గొని, బీఐఎం సాఫ్ట్‌వేర్ ప్రత్యేకతలు, ప్రాజెక్ట్ డిజైన్ నుంచి నిర్మాణం వరకు దీని వినియోగాన్ని ప్రత్యక్ష ప్రదర్శనలతో వివరించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. బీఐఎం వంటి టెక్నాలజీ విద్యార్థులకు కొత్త అవకాశాలు తీసుకువస్తాయని న్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, సివిల్ విభాగాధిపతి జి.రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికోటకు వెళ్లివచ్చిన విద్యార్థులు..

సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్), శ్రీహరికోటలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి తెలిపారు. బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినులు కె.సునైనా నాయుడు, ఎం.త్రివేణి రెండు నెలల పాటు ఇంటర్న్‌షిప్‌లో కృత్రిమ మేధస్సు(ఏఐ), యంత్ర అభ్యాసం(మెషిన్ లెర్నింగ్) ఆధారంగా రాడార్ డేటా కొలబ్రేషన్ ప్రాజెక్టుపై శిక్షణ పొంది ధ్రువపత్రాలు సాధించారన్నారు. ఈ మేరకు సదరు విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ తదితరులు అభినందించారు.

విద్యుత్ చార్జీల భారంతో మూతపడుతున్న పరిశ్రమలు

- సంఘ విద్రోహక శక్తులతో జాగ్రత్త
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్



మహాకవి గురజాడకు నివాళులర్పిస్తున్న మాధవ్

విజయనగరం టౌన్: విద్యుత్ చార్జీల భారంతో ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలు నష్టాలబారిన పడుతున్నాయని, రాజాం, నెల్లిమర్లలో పరిశ్రమలు మూతపడ్డాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సారథ్యం యాత్రలో భాగంగా ఆయన జిల్లాలో సోమవారం పర్యటించారు. ముందుగా రైతు బజారు వద్ద చాయ్‌పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహాకవి గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పైడితల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మహారాజా సంగీత, నృత్యకళాశాలను సందర్శించారు. కోట కూడలి నుంచి సుజాత కన్వెన్షన్ వరకూ శోభాయాత్ర చేశారు. అక్కడ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద డ్రగ్స్ వినియోగం జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు సంఘవిద్రోహ శక్తులు పుట్టుకొస్తున్నాయని, నిఘా సంస్థలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. విజయనగరంలో మతోన్మాదం విషబీజంగా పెరుగుతోందని, ఉగ్ర భావజాలం ఉన్న వ్యక్తి ఇటీవల పట్టుబడడమే దీనికి నిదర్శనమన్నారు. అమెరికా టారిఫ్ విధానం వల్ల గోదావరి జిల్లాల్లో ఆక్వారంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రధాని దృష్టికి సమస్య తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జాతీయ కౌన్సిల్ సభ్యులు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ నూకల మధుకర్, ప్రతినిధులు పాకలపాటి సన్యాసిరాజు, బూర్లు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు కూటమి మోసం

- అంబేడ్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి



టీపీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న భానుమూర్తి, తదితరులు

విజయనగరం టౌన్: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని అంబేడ్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి విమర్శించారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్లిన ఆయన నగరపాలక సంస్థ టీపీఆర్ఓ సింహాచలానికి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. టిడ్కో గృహ సముదాయాలకు జీఓఎంఎస్ నంబర్ 39 ద్వారా వయసు, సిబిల్ స్కోర్, నాట్ ట్రేసింగ్‌లను అర్హతలుగా చూపిస్తూ సోనియానగర్, సారిపల్లి లబ్ధిదారుల తొలగింపు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ఇళ్లు ఇవ్వకుండా మౌలిక వసతులు కల్పించకుండా బ్యాంకు అప్పులు ఇప్పించడం, ఎన్‌పీఏల వల్ల బ్యాంకులు నో టీసులు ఇవ్వడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2024 ఎన్నికల సమయంలో కూటమి అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తా మని చంద్రబాబు చెప్పారని, నేటికి వారు అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా టిడ్కో రుణాలు మాఫీ కాలేదన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రూ.లక్ష లబ్ధిదారుల వాటాను రూ.50 వేలుగా, రూ.50 వేలు లబ్ధిదారుల వాటాను రూ.25 వేలుగా రూ.500 లబ్ధిదారుల వాటాను రూపాయిగా ఇచ్చారని గుర్తుచేశారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

విజయనగరం టౌన్: దళిత, ఆదివాసీల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు కోరారు. ఇదే విషయమై ఆయన నగరంలోని డీబీఎస్‌యూ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద జ్యోతిరావుపూలే విగ్రహం దగ్గర నుంచి ర్యాలీ ఉంటుందని, ఇది యూత్ హాస్టల్ వరకు కొనసాగి, అనంతరం అక్కడ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపు, సక్రమంగా వాటి వినియోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మహిళలు, బాలల హక్కుల పరిరక్షణకు చేసిన గత కార్యక్రమాల ఫలితాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రతినిధులు రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

బార్ నూతన పాలసీపై సమావేశం



పాలసీ వివరాలు వెల్లడిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసచౌదరి

విజయనగరం టౌన్: జిల్లాలో 2బి బార్స్ నోటిఫికేషన్ విడుదలైందని, ఔత్సాహికులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి కోరారు. నగరంలో బార్ నూతన పాలసీపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18, బొబ్బిలి మున్సిపాలిటీలో పరిధిలో నాలుగు, రాజాం నగరపంచాయతీ పరిధిలో ఐదు, భోగాపురం వీఎంఆర్‌డీఏ పరిధిలో ఒకదానికి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల్లో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందించాలన్నారు. ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి సెలక్షన్ ఇంటిమేషన్ స్లిప్ అందజేస్తామన్నారు. జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, టూరిజంల వారీగా కల్లుగీత కులాల వారికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకటి, నెల్లిమర్ల నగర పంచాయతీలో ఒకటి, రాజాం నగర పంచాయతీలో ఒకటి కేటాయించామన్నారు. కల్లుగీత కులాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని, ఈ నెల 30న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక, ఇంటిమేషన్ స్లిప్‌లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా చెల్లించకుంటే చర్యలు

విజయనగరం టౌన్: వాహనదారులంతా వారం రోజుల్లోగా ఈ చలానాలు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్ హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన సోమవారం ఓ ప్రకటనలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది వాహనదారులకు సంబంధించి, ఈ–చలానాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ చెల్లించాలని తెలిపారు. ఈ చలాన్ డాట్ పరివాహన్ జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, చలాన్లు చెల్లించవచ్చన్నారు.

సాగునీటి చెరువులపై ప్రత్యేక దృష్టి

మెరకముడిదాం: వర్షాకాలంలో సాగునీటి చెరువులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి డి.మల్లికార్జునరావు ఆదేశించారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు ఆయన మండలంలోని ఉత్తరావల్లిలో సదాశివుని చెరువుని పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా చెరువుకు గండి పడే అవకాశం ఉందేమోనన్న కోణంలో ఆయన పరిశీలించగా.. చెరువులో పెద్దగా నీరు లేకపోవడాన్ని గమనించారు. దీంతో మండలంలో మిగిలిన చెరువుల పరిస్థితులపై ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఇరిగేషన్ ఏఈ లక్ష్మీకాంత్‌లను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సాగునీటి చెరువులపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు.